
సీరియల్ కథ

# వసంతం వచ్చింది!!



★

* రచన : "శ్రీ కేశ్" *

(గతసంచిక తరువాయి)

శ్రతవి ప్రవర్తనకు నవ్వుతు 'అవును శ్రావణ్ ఇది ప్రేమే వటరా....ప్రేమ....తనలో తానే అనుకుంటు పులకరించిపోతున్నాడు.'

'అవునురా ఇది ఖచ్చితంగా ప్రేమే. అలాంటి ఇలాంటి ప్రేమ కాదురా. పంచరంగుల సినిమాలో హీరో, హీరోయిన్ ప్రేమరా, అవును, ఆమె నిన్ను ప్రేమిస్తున్నట్లు ఏమైనా తెలిపిందా? లేక....'

'ఏమో తెలియదు కాని....ఆమె నన్ను చూస్తేనే పరధ్యానంగా యుంటుంది.'

'ఆఁ....అదే-అదే ప్రేమకు మొదటి స్టెప్! షెహబాష్ ఇదే నా శుభా కాంక్షలు కళ్యాణమస్తు .... తథాస్తు!' అంటూ దీవించాడు శ్రావణ్.

'ఆగరా నీ దీవెనలు స్నానం చేయాలి. నీకు డ్యూటికి వేళవుతూ లేదు....ఏదో పని ఉందన్నావు, కాని ఏమి పట్టనట్లున్నావు. పదరా తొందరగా స్నానం చేయాలి.' అంటూ లేచి స్నానాల గదివైపు వెళ్ళాడే కాని మనస్సంతా పల్లవి పైననే.

'నేను ఆమెను ప్రేమిస్తున్నానా....ఆమె నన్ను ప్రేమిస్తుందా.. ఏమో ప్రేమిస్తుంది కాబోలు....అందుకే ఆ పరధ్యానం అనుకుంటాను....శ్రావణ్ వచనాలు నిజం అవుతాయ్....' అని లోలోనే అనుకొంటూ 'అబ్బా!' అని చిన్నగా కేకవేసి తన పరధ్యానానికి తానే సిగ్గుపడ్డాడు వసంత్.

'ఏంటిరా, ఏంటి....ఏమయింది?' అంటూ హడావిడిగా వచ్చాడు శ్రావణ్.

'ఏం లేదురా, కొంచెం వేడినీరు పైన పోసుకున్నాను అంతే!'

'అవును పోసుకుంటావు, పోసుకోక ఏం చేస్తావు.... నేను అప్పుడే అనుకున్నాను పల్లవి నీడ్ని వట్టిగా విడిచిపెట్టదని. ఒరేయ్, ఇంత పరధ్యానంగా రోడ్ల వెంబడి వెళ్తే కేవలం ఓ పది కార్లు, ఇరవై బస్సులు, ఓ నలభై మోటారు బైకులు ముద్దెట్టుకుంటుంటాయి అంతే! ఇక మరి పల్లవి లేదు, నీవు లేవు....అసలు ఉండవు....ప్రేమలో పడ్డాడు. ప్రేమ వలలో పడ్డాడయ్యో పాపం పసివాడు....అయ్యో పాపం పసివాడు' అని పాడుతూ వెళ్ళాడు శ్రావణ్.

'ఛీ, ఏమిటి ఈ పరధ్యానం....అయినా అంత పెద్ద ఆశలు, ఊహలు అల్లుకోవద్దు. నక్కెక్కడ, నాగలోకం ఎక్కడ ?' అని అనుకుంటూ స్నానాని కుపక్రమించాడు వసంత్.

* * *

'నమస్కారమండీ !' అంటూ అపుడే లోనికి అడుగు పెట్టాడు వసంత్.

'నమస్కారం ! రావోయ్ వసంత్, కూర్చో' అని సీటు చూపించి అంతలోనే రఘును చూసి 'ఆఁ, రఘుకూడ వస్తున్నాడే....రా బాబు రా !' అంటూ ఆప్యాయతతో పిలిచాడు రావు.

'థాంక్స్.' అని కూర్చున్నారు. వారిద్దరిని పరిచయం చేయించి కాఫీలకు ఆర్డర్ యిచ్చాడు దశరథరావు.

'బాబాయ్‌గారూ ! మీరు మీ హెల్తును బాగా కాపాడుకోవాలి. మీరు కొన్ని రోజులు ఈ ప్రాంతాన్ని వదిలి దూరంగా వెళ్ళాలి - ఈ బిజినెస్ వ్యవహారాలు మానివేసి విశ్రాంతి తీసుకోవాలి....ఇవిగో ఈ మెడిసిన్స్ ! ఇవి ఎలా వాడాలో చెల్లాయికి చెప్తాను. ఏది ఏమైనా మీరు విశ్రాంతి తీసుకోవాలి. అందుకొరకు ఏ కాశ్మీరో ఎక్కడికన్నా వెళ్ళాలి.'

'సరే లేవోయ్ రఘూ, వెళ్దాంలే.'

'అలా అంటే కుదరదు. తొందరగా ప్రయాణానికి సిద్ధం కండి. వ్యవహారాలన్నింటినీ పూర్తి చేసుకుని ఇంకో పదిహేను, పదహారు రోజులలో మీరు వెళ్ళాలి.'

'అలాగే !' చిరునవ్వు నవ్వుతూ మళ్ళీ అన్నాడు రావు.

'అలాగే అంటే సాగదు; ఇందుకు నాందిగ రేపు మనం దరమూ కలిసి పిక్నిక్‌కు వెళ్తున్నాం.'

'రఘూ ! ఇక్కడ విశ్రాంతి దొరకదటోయ్ - మంచి పార్కులు ఏర్‌కండీషన్ గదులు ఎంత హాయి !'

'అమ్మమ్మ - మీరు ఇక్కడ ఉంటే ఒక్క నిమిషం తీరిక తీసుకోరు. కావున రేపు పది గంటలకు అలా వెళ్దాం. ఇంకో పది రోజుల్లో మీరు ఎటన్నా దూరం వెళ్ళిపోవాలి.'

'ఏమిటి, ఎటో పిక్నిక్ అంటున్నారు. నేను రెడీయే !' అంటూ ప్రవేశించాడు సుందర్. అతన్ని వసంత్‌కు పరిచయం చేయించాడు రావు.

'ఏమిటి సుందర్, ఇంత కాలానికి నీ దర్శనం ! ఎటు వెళ్తున్నావ్ ?'

'మామయ్యా ! నేను ఎన్నో మార్లు వచ్చాను. కావి, మీరు దేవుని దర్శనం మాదిరి అగుపించుట లేదు.'

'సరే, ఏమిటి విశేషాలు ?'

'ఏమి లేవు. అలా మిమ్మలను చూసి పోదాం అనిపించింది. అంతే ! ఇలా బయలుదేరాను. అవునూ, పల్లవి ఏది ?' అంటూ భవనపు నాలుగు దిక్కులు వెదికాడు సుందర్.

'ఇదుగో యిపు డొస్తున్నాను. నన్నెందుకు తలిచారు మధ్యలో ?' అంటూ నవ్వుతూ వస్తూ పల్లవి వసంత్‌ను చూసి గ్రీట్ చేసి, రఘు చెంతకెళ్ళి 'ఏమిటన్నయ్యా, మీరు అసలే రావడం లేదు ?' అంటూ బుంగమూతి పెట్టింది పల్లవి.

'ఏమి లేదమ్మా, నాన్న ఆరోగ్యం బాగులేదు. వారికి విశ్రాంతి అవసరం. కావున ప్రస్తుతం నీ పరీక్షలు ఇంకో పది, పదిహేను రోజుల్లో అయిపోతవి కదా ! వెంటనే మీరు ఎటన్నా దూరం వెళ్ళిపోవాలి. ఇదుగో ఈ మందులు క్రమం తప్పకుండా ఇదివరకటిలాగే వాడాలి.'

'అలాగే !' అంది మూతి ముడుచుకొని పల్లవి.

'ఏమిటి మరదలుగారూ, బుంగమూతి పెట్టారు. ఎంత అందంగా యున్నారు అ ఫోజులో ?' అంటున్న సుందర్ మాటలు విని కోపం వచ్చినా కనబడనీయక —

'అవును, ఇంకా కోతి ముఖం పెడితే బాగా ఉంటుంది బావగారికి !....' అంటూ 'నే డ్రెస్ ఛేంజ్ చేసుకొస్తా నన్నయ్యా !' అంటూ పైకి పోబోయింది.

'అబ్బే, నే వెళ్తున్నానమ్మా ! నాకు కొంత అర్జంటు వర్క్ ఉంది. మళ్ళీ రేపు ఉదయమే వస్తాను.' అంటూ అందరివద్ద సెలవు తీసుకున్నాడు రఘు.

పల్లవి తనని హేళన చేస్తే, అందరూ నవ్వుతూంటే, ముఖ్యంగా వసంత్ నవ్వుతూంటే కోపంవచ్చి పైకి తన బడనీయక 'నేను వెళ్తాను మామయ్యా!' అంటూ రఘుతో నడిచాడు.

'ఏం బాబూ, రేపు తప్పకుండా రా !' 'సరే' నంటూ ఇద్దరూ వెళ్ళిపోయారు.

వారు వెళుతున్నవైపు రావు చూస్తూ 'ఏమిటో వసంత్ కొందరి జీవితాలు అతి విచిత్రంగా వుంటాయి. ఇక్కడ వారిద్దరినీ పరిశీలిస్తే చదువుకున్న వారికి డబ్బుండదు, డబ్బున్న వారికి చదువుండదు అని తెలుస్తుంది. వారు ఎవరో అని అనుకుంటున్నావు కదూ - అరే వీరికి కుమారులు లేరే ! మరి ఆ రఘు అని సందేహిస్తున్నావు.... అతనిది ఒక కథ వినాలని ఉందా, లేక బోరు వస్తుందా ?'

'అబ్బే, చెప్పండి' అంటూ ఉత్సాహంతో ఏమిటో అని కుతూహలంగా యున్నాడు వసంత్.

'సరే, చెబుతాను విను....ఆ రఘు ఒక అభాగ్యుడు. అతని తల్లిదండ్రులు అతనికి ఊహ తెలియనినాడే దివంగతులయినారు. అతని తండ్రి నా యొక్క ప్రియ స్నేహితుడు. పేదవాడయిన ఆత్మాభిమానం కలవాడు. తల్లి లేని ఆ కొడుకును ఎంతో గారాబంగా పెంచాడు. నేను ఏదైనా సహాయం చేయబోతే తీసుకునేవాడు కాడు. అందుకే అతనంటే అమితమైన ప్రియం నాకు. ఒకనాడు వాడు చనిపోయేటప్పుడు తన కొడుకును నా చేతిలో పెట్టి చూసుకొమ్మని చెప్పి చనిపోయాడు. తల్లిదండ్రి లేనివాడ్ని తీసుకొచ్చాను. అతనికి అపుడు ఐదేళ్ళు. మాకుకూడ పిల్లలు లేరపుడు. వాడ్ని నా భార్య ఎంతో అల్లారు ముద్దుగా పెంచింది. కాని ఎపుడయితే పల్లవి జన్మించిందో అపుడు ఆమె చనిపోయింది. పల్లవిని, రఘును నా రెండు కళ్ళలా చూసుకున్నాను. వారిద్దరు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. పల్లవికి రఘు అంటే ప్రాణం. ఆమెకు అన్న లేనందున ఎంతో ప్రేమగా చూసేది. రఘుకూడ పల్లవిని ప్రేమగానే చూసేవాడు. ఇలా వుండగా ఒకనాడు క్లాస్‌లో ఎవరో 'పరాయి పంచన పడి ఉన్నావు. నీవు మాతో సరిసమానంగా ఉంటావా? వెళ్ళి వెనక్కి కూర్చో!' అని చెప్పారట. వాడు తెలిసికొని అవమానంతో ఎటో వెళ్ళిపోయాడు. పల్లవి ఎంతో దుఃఖించింది. కాని పరిస్థితుల వల్ల మరిచిపోయింది. దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత వచ్చి నన్ను నమస్కరించి చెప్పాడు. 'వాడు నాట్యం చేస్తూ, ప్రోగ్రామ్స్ యిస్తూ ఎం. బి. బి. యస్. చదివాడని తెలిసి, తండ్రియొక్క ఆత్మాభిమానం, పట్టుదల వీనిలో ఉన్నాయని ఎంతో గర్వించాను. ఇంటిలోన యుండరా అంటే - నేనెక్కడున్నా మీ కుమారుడ్నే అని స్వయం శక్తిపై పైకి వచ్చాడు. నాకున్న ఆత్మీయులలో వీడొకడు.' అంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకొని 'వానికి నాపైన ఎంతో ప్రేమ ఉన్నది. మొన్న నేను క్లబ్‌లో తూలి పడిపోతే అక్కడికి ఎవరి కొరకో వచ్చిన రఘు నన్ను లేపి ఎన్నో పరీక్షలు చేసి, ఇదిగో యిన్ని మందులు తెచ్చాడు. నాపైన ప్రేమ వానికి ఉన్నది. నాకు కొడుకులు లేనందుకు వీడ్ని చూస్తూ తృప్తి పడేవాడ్ని.' అంటూ ఒక్క నిట్టూర్పు విడిచి—

ఇక వీడు ఉన్నాడు. బొంగరం ఎంతో ఆస్తి, ఐశ్వర్యం ఉన్న తెలివి తక్కువ దద్దమ్మ. ఆడవారితో తిరుగుతూ, తాగుతూ తిరుగుతుంటాడు. వెధవ బి. ఏ. తో నాలుగుసార్లు తప్పాడు. వరుసకు అల్లుడవుతాడు. కాని వీడ్ని అల్లునిగా తలిస్తేనే ఒళ్లు కంపరమొస్తుంది. నాకు వరుసలు, కులాలు, మతాలు, ఆస్తులు, అంతస్తుల గురించి అంత పట్టింపులేదు. నాకు గుణం ప్రధానం. మొదటిసారే నిన్ను చూసినపుడే అనుకున్నాను తెలివైన వాడవని. అంతే కాదు. నాకు కొంత ప్రాంతీయాభిమానం ఎక్కువ. అందులోనూ జగన్నాధం అల్లునివటగా - మళ్ళీ అందులో నీవు మాకు ఎంతో సహాయం చేసినావు. అందుకే నీపై నాకు విశ్వాసం, నమ్మకం ఏర్పడాలి. ఆఁ....నీవు కూడా మాతో రేపు రావాలి.'




మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మాసర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్‌లాక్ * ఓవిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* కైరాజ్ * రాకెట్

ఇవికాక ∫ జెట్టీలు ∫ లండన్ ∫ సిమిత ∫ బాబి
అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు
అన్ని ప్రముఖ బట్టల షాపులలోనూ దొరుకును.

**BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.**

'నాపై మీకున్న అభిమానమే మిమ్ములనిలా అని పిస్తుంది. అంతే కాని నా సహాయం మీకు ఎంతండీ ! తప్పకుండా రేపు వస్తాను.' అంటూన్నంతలో బట్టలు మార్చుకొని వచ్చిన పల్లవి 'ఏమండీ, పాఠాలు చెబుతారా ?' అని అనగానే 'వెళ్ళు బాబూ, వెళ్ళు' అని రావు లేచి వెళ్ళి పోగానే, వసంత్ 'పదండి వెళ్దాం.' అని ఆమెను అనుస రించాడు.

*　　*　　*

'ఆహా - ఎంత చల్లని వాతావరణం....ఎంత అంద మయిన ప్రదేశం....అందుకే కాబోలు, రోగిని డాక్టర్లు ఎక్కడికైనా ప్రశాంత వాతావరణం ఉన్న ప్రదేశానికి వెళ్ళి విశ్రాంతి తీసుకోమంటారు.' ప్రకృతిని చూస్తూ తన్మయుడై అన్నాడు దశరథరావు.

'అవును బాబాయ్ ! బొంబాయిలో ఏదైనా దీని క్రింద దిగదుడుపే. పట్నం-పట్నం అని అంటారు. కాని పల్లెలు ఎంతో అందమయిన 'పట్నాలకు వెళ్ళొద్దు. పల్లెలే మన గుళ్ళురా' అని అన్నాడు ఒక కవిచంద్రుడు. ఏది ఏమైనా పల్లెలు మన దేశానికి జీవనాడులు. సంస్కృతికి నిల యాలు, ప్రకృతికి ఆరాధ్య దైవాలు' అని అన్న రఘు మాటలకు—

'ఆఁ....ఏముంది! అందరూ పట్నాలకు వెళ్ళొద్దు అని అనుకొని ఆ వాక్యం వ్రాశాడు కాబోలు. అంతే కాక, పల్లెలు మన జీవనాడులు అనడం సమంజసం కాదు. ఎందు కంటే పట్నాలలోకూడ పంటలు పండిస్తున్నారు. పల్లెలో ఏముంది దుబ్బు-దూళి. ఒకవేళ మనము పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే, ఆహార పదార్థాలు ఎగుమతులు చేసు కుంటాము, అంతే!' అని వానిని ఖండించాడు సుందర్. అతను తప్పుగా వాదిస్తున్నా చివరకు తనదే నెగ్గాలనే మన స్తత్త్వం కలవాడు సుందర్, అందుకు అడ్డదారులయినా త్రొక్కుతాడు.

'కావచ్చు సుందర్ ! కాని అది అన్ని వేళలా సాధ్య పడదు. స్వయం పోషణాశక్తి మొదట దేశం సాధించాలి. అందుకు పల్లెలు, ప్రకృతి సాధనాలు. పల్లెలు లేనిది ఏమీ చేయలేము. మనము తినే వస్తువు, కట్టుకునే గుడ్డలు వానిలో ప్రతి ఒక్క దానికి పల్లెవాళ్ళ రక్తపు బిందువులు దాగి ఉన్నాయి.'

'ఆఁ....వారికి మనం ప్రతిఫలం యివ్వలేమా, ఏమి రఘుగారూ ! మనవద్ద డబ్బుంది. వారి దగ్గర శ్రముంది. వారు డబ్బును తీసుకొని మనకు శ్రమను యిస్తున్నారు. దట్సాల్ - అంతేకాని, వారు ఏదో దేశానికి వెన్నెముకలు అనడం సమంజసం.' కాదు.

'కాని, సుందర్‌గారూ ! మీ వద్ద ఎంత డబ్బున్నా అది నిష్ప్రయోజనమే అవుతుంది కొన్ని వేళల్లో. ఏదీ మీరు ఒక్కనాడు కష్టపడండి తెలుస్తుంది. వారు చేసే శ్రమ విలువ ఎంతనో అంతేకాని, మనము నిజంగా ఆ శ్రమకు విలువ కట్టలేము. అంటూ మాట్లాడుకుంటున్న రఘు, సుందర్‌లను వారి సంభాషణ యింకా ఎంత దూరం పోతుందో అని అనుకుంటూ, 'ఏమిటన్నయ్యా ! అలా మాటలు తర్వాత తీరిగ్గా మాట్లాడ కోవచ్చు గాని - పాపం, డ్రైవర్, వసంత్ మాత్రమే సామాను సర్దుతున్నారు. కొంచెం సహాయం చేద్దాం రండి.' అంటూ పల్లవి పిలిచింది.

'అవును.' అంటూ రఘు వెళ్ళాడు. రావు యిదేమీ పట్టనట్లు ఎటో చూస్తూ వెళ్తున్నాడు. కాని సుందర్ అప్పుడే వచ్చిన వసంత్‌ను చూస్తూ గోల చేయాలని తలచి 'ఆఁ, ఏం పరదలు పిల్లా ! పరోపకారానికి కంకణం కట్టు కున్నావా ఏమి ? వసంత్ ఏమీ అరిగిపోడులే. అయినా మనము డబ్బిస్తున్నాము. వారు శ్రమ చేస్తున్నారు. మనము ఎంత సహాయం చేసినా వారు అంతే. ఎన్నటినుండో ఈ వసంత్ లాంటి బానిసలను రూపు మాపాలని అనుకుంటు న్నారు. కాని 'కనకపు సింహాసనము పైన శునకము కూర్చుండ దగునా' అన్నట్లు ఎప్పటికీ వెనకకే పోతున్నారు. వారి బానిసబుద్ధి పోనివ్వరు. ఎంతయినా బానిసలు !'

అది వసంత్ విని 'సుందర్‌గారూ ! మీరు అనుకున్నట్లు శ్రమ చేసేవాడు బానిస అయితే - అదుగో ఆ రఘు, దశరథరావు చదువు కొరకు నిరంతరం కష్టపడే పల్లవి కాదు. ఉన్న డబ్బును ఖర్చు చేయడానికి కష్టపడే మీరు అందరూ బానిసలేనా ?' అంటూ ప్రశ్నించాడు.

అందుకు కోపంతో 'ఏమిటోయ్ నీ దబాయింపు నీ అంతస్థు ఎంత, నువ్వెంత ? కడకంటి చూపు చూస్తే కాలి పోతావ్. నీవు మమ్ములను బానిసలుగా చిత్రీకరిస్తావా ?' అన్న సుందర్ మాటలకు—

'వారేమి అన్నారు బావా ! అనవసరంగా కోపానికి వస్తావు, అతను మనిషే. ఎందుకు? ఆచారంలేని మాటలు!' అంటూ వెళ్ళిపోయింది పల్లవి.

ఆమె మాటలకు, తృణీకరకు కోపంతో 'ఆఁ, నీవు ఆ కుక్కను సమర్థిస్తున్నావా? విశ్వాసం లేదు. యజమాని అల్లునిపైకి ఎదురుజవాబు యిస్తున్నాడు స్కౌండ్రల్. ఆ కుక్కకున్న విశ్వాసం లేదు' అన్నాడు సుందర్.

[సశేషం]